పచ్చమూకల తీరుపై నిరసన గళం

మచిలీపట్నంటౌన్: విజయవాడలోని అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఫలకంపై పచ్చ మూకల దాడికి నిరసనగా మచిలీపట్నం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం వద్ద వారితో పాటు పార్టీ దళిత విభాగం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ సామాజిక అభ్యున్నతే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇది నచ్చని పచ్చ మూకలు గురువారం రాత్రి సుత్తులు, ఇతర పరికరాలతో విగ్రహంపై దాడి చేయటంతో పాటు సామాజిక న్యాయ మహాశిల్పం బోర్డు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును ధ్వంసం చేశారన్నారు. విజయవాడలో మునుపెన్నడూ ఏ ముఖ్యమంత్రి ధైర్యం చేసి పెట్టని అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని జీర్ణించుకోలేని పచ్చమూకలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. ఈ దాడిని ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, మేకల సుబ్బన్న, తిరుమలశెట్టి వరప్రసాద్, పర్ణం సతీష్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, పెడన కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మద్దుల పాండురంగారావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎగ్గోని గాంధీ, దళిత విభాగం నాయకులు ఉచ్చుల గణేష్, దార్ల చెన్నకేశవరావు, చీలి చక్రపాణి, దమ్ము కేశవరావు, మంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, షేక్ మొహమ్మద్ సాహెబ్ తదితరులు ఉన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ



సీతాయిలంకలో నిరసన తెలుపుతున్న జై భీం భారత్ పార్టీ నాయకులు, బీసీ నేతలు

సీబీసీఐడీతో విచారణ చేపట్టాలి

అవనిగడ్డ: విజయవాడలో భారత్ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ జైభీం భారత్ పార్టీ ఆధ్వర్యంలో అవనిగడ్డ శివారు సీతాయిలంక అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్ మాట్లాడుతూ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. నేడు పేరుని ధ్వంసం చేశారు. రేపు ఇంకేమన్నా చేయవచ్చని విజయవాడ నడిబొడ్డున ఇలాంటి విధ్వంసం సృష్టించిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనను సీబీసీఐడీతో విచారణ చేయించి వీరితో పాటు వీరి వెనుక ఎంతటి వారున్నా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు గొర్రుముచ్చు రవి, బీసీ నాయకులు లుక్కా పిచ్చయ్య, కోలా బాలాజీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన శ్రావణ పూజలు



కోట ముత్యాలమ్మ తల్లికి మొక్కుబడులు చెల్లిస్తున్న భక్తులు

ఘంటసాల: మండలంలో శ్రావణమాస సంబరాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఘంటసాలలో గ్రామానికి చెందిన డాక్టర్ మున్నంగి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. నైవేద్యాలను, పాల పొంగళ్లను డాక్టర్ రాంబాబు, కుమారుడు మున్నంగి హేమంత్, పసుపు కుంకుమ, వివిధ రకాల పండ్లు, పూజ సామగ్రి, నూతన వస్త్రాలను కుమార్తె మున్నంగి భవ్యలు గ్రామోత్సవం నిర్వహిస్తూ ఘంటసాల గ్రామదేవత శ్రీ పెన్నేరమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి ఊరేగింపుగా కోట ముత్యాలమ్మ తల్లి దేవస్థానంలో అమ్మ వారికి పొంగళ్లు, నైవేద్యాలు, చీర సారెలు సమర్పించారు. అనంతరం 500 మందికి అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో సైదులు, సీతామహాలక్ష్మీ, కంభాల వెంకటేశ్వరరావు, పార్వతి, డి.సాంబశివరావు, డి.పార్వతి, వీఆర్వో పాండు రంగారావు, భక్తులు పాల్గొన్నారు.

పెడన: పట్టణంలో శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా వేంచేసి ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారి దేవాలయంలో మహాచండి హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవసాయపక ధర్మకర్త దాసు వాయినందనరావు, మురళికుమారి దంపతులచే వేదపండితులు కొండేటి తరుణ్‌కుమార్ మహాచండి హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. పలువురు దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకటమోహనరావు ఆయా పూజాది కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తుల సందర్శనార్థం పైడమ్మ అమ్మ వారిని ఈ శ్రావణమాసంలో ప్రత్యేకంగా అలంకరించామన్నారు.

మోపిదేవి: శ్రావణమాసం తొలి శుక్రవారం నాగపంచమి సందర్భంగా మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాస్థానంలో ఉదయం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. స్వామివారి నిత్యకల్యాణం, సర్వదోష నివారణ పూజలు చేయించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాగాయలంక(అవనిగడ్డ): మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శ్రావణ కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. భావదేవరపల్లి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేరస్వామి ఆలయంలో అమ్మవారికి శ్రావణ కుంకుమ పూజలు జరిపారు. గణపేశ్వరంలో దుర్గమ్మ అమ్మవారికి పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పి. సత్యనారాయణశాస్త్రి పూజా కార్యక్రమాలు జరిపించారు. నాగాయలంక కన్యకా పరమేశ్వరి ఆలయంలో పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మచిలీపట్నంటౌన్: శ్రావణమాసం మొదటి శుక్రవారం కావటంతో నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని ఈడేపల్లి శక్తిగుడి, బెల్లంకొట్ల సందులోని మహాలక్ష్మీఅమ్మవారి ఆలయం, పలు ప్రాంతాల్లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాలకు పెద్ద ఎత్తున తరలివెళ్లి పూజలు చేశారు. ఆలయ కమిటీలు ఆలయాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావటంతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిశాయి.

సంక్షిప్తం

ఘనంగా క్విట్ ఇండియా వేడుకలు

అవనిగడ్డ: క్విట్ ఇండియా దినోత్సవం స్థానిక గాం. దీక్షేత్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు గుడివాక శేషుబాబు, ఎంపీటీసీ బొప్పన భాను, మండలి రామ్మోహనరావు, బండే రాఘవ, ఘంటసాల కన్నయ్య, బచ్చు రఘునాద్, లుక్కా పిచ్చయ్యతో పాటు పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు. అవనిగడ్డలో చేపట్టిన డ్రెయినేజీ పూడిక తీత పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.

అమెరికాలో వేడుకలకు ఆహ్వానం

అమెరికాలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించే అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) 16వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ని ఆహ్వానించారు. ఆప్తా బిజినెస్ ఫోరం చైర్మన్ రమేష్ తూము శుక్రవారం బుద్ధప్రసాద్‌ని కలసి ఆహ్వానం అందించారు. ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వ విధానలతో వ్యవసాయ రంగం సంక్షోబంలో పడిందని దానిపై ఆధారపడ్డ రంగాలు కుదేలు అయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. ఏపీ రైతు సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై అమలు చేస్తున్న విధి విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. శుక్రవారం నిరసన కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూ, ఐద్వా నాయకులు ఎం.శ్రీనివాసరావు, పి.ధనశ్రీ, ఎస్.జనార్ధనరావు, బి.నాగరాజు, ఎల్. అజయ్ ఘోష్, ఎం.శివరాంప్రసాదు, పి.వెంకన్న పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వరద పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి

నాగాయలంక(అవనిగడ్డ): వరద ఉధృతి పెరగడంతో తహసీల్దార్ హరనాథ్ శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు హెచ్చరికలు చేశారు. ఎదురుమొండి ఫంట్ వద్ద పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఫంట్ నిర్వాహకులతో మాట్లాడి జాగ్రత్తలు చెప్పారు. ఏటిమొగ పడవల రేవు వద్ద వరదను ఆయన పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడి చేపల వేట పట్ల అప్రమత్తం చేశారు. టి కొత్తపాలెం వద్ద కరకట్టను పరిశీలించారు. ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు గ్రామంలో శుక్రవారం రైతులకు సార్వా వ్యవసాయ సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఏఓ శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయం సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)ఏడీఏ శ్రీనివాసరావు పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పెట్టుబడులు తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు సంసిద్ధులు కావాలని సూచించారు. రైతులతో కలసి పంట పొలాల్లో పర్యటించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఆత్మ ఏటీ పద్మజ, వీఏఏలు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

అవనిగడ్డ: విజయవాడలో ఓ వైద్యశాలలో ఆపరేషన్ నిర్వహించాల్సి ఉన్న ఏసుదాసు అనే పేషెంట్‌కు అవనిగడ్డకు చెందిన ఇద్దరు యువకులు రక్తదానం చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా రక్తదానం గురించి తెలుసుకున్న వినయ్ బ్లడ్ ఫౌండేషన్ నిర్వాహకులు వినయ్ తన గ్రూపులోని సభ్యులకు సమాచారం అందివ్వగా ఎం.అజయ్, గొర్రుముచ్చు జగన్ అనే ఇద్దరు యువకులు విజయవాడ వెళ్లి రక్తదానం చేశారు.

సెలవు దినాల్లోనూ ఫిర్యాదు చేయొచ్చు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మీ కోసం ఫిర్యాదుల విభాగానికి సమాచారం ఇవ్వాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నివాస పరిసరాలకు సంబంధించిన సమస్యలతో పాటు తాగునీటి, పారిశుద్ధ్య, విద్యుత్ దీపాల సమస్యలను ఫోన్ ద్వారా లేదా కార్యాలయానికి నేరుగా వచ్చి మీకోసం విభాగంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. రోడ్డు మార్జిన్లలో ఆక్రమణలు జరిగినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యలపై 98499 07989, 08672–227700 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. సెలవు దినాల్లో కూడా ఫిర్యాదు చేయవచ్చని ఆయన వివరించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

గూడూరు: మండలంలోని కప్పలదొడ్డిలో పునఃనిర్మించిన కోదండరామాలయంలో దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. ఎన్నో ఏళ్ల నాటి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయ పునఃనిర్మాణం చేపట్టారు. నిర్మాణపనులు పూర్తవ్వడంతో శుక్రవారం వేదపండితుల మంత్రాల నడుమ విగ్రహప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో దాదాపు నాలుగు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.


ఘనంగా ఆదివాసీ దినోత్సవం

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డలో అంతర్జాతీయ ఆదివాసీ (గిరిజన) దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు ఆధ్వర్యంలో గిరిజనుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పురిటిగడ్డ ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన గిరిజన మహిళ కట్టా కనకదుర్గను సురేష్‌బాబు ఘనంగా సత్కరించారు. కాకి సుకన్య, కె రమాదేవి, పల్లికొండ హేమలత పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీలో విద్యార్థుల సత్తా

గూడూరు: నెల్లూరులో ఈనెల 2 నుంచి 4 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో మల్లవోలు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు సత్తాచాటారు. కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కె.కేజియా, కె.కీర్తన, జి.శ్రావణి, కె.దీపికలు అత్యుత్తమ ప్రతిభ కనపర్చి ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.అరుణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు క్రీడాకారిణులను అభినందించారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, పి.రవీంద్రబాబుల శిక్షణను ప్రశంసించారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మృతి



గూడూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేముల కుటుంబరావు (88) గురువారం రాత్రి మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబరావు ఆర్టీసీలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలంగా పనిచేశారు. 2001–06 మధ్యకాలంలో కంకటావ ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్నారు. తర్వాత వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఈయన పెద్ద కుమారుడు వేముల సురేష్ రంగబాబు ప్రస్తుతం గూడూరు జెడ్పీటీసీగా ఉన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ శుక్రవారం కుటుంబరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కుటుంబరావు మృతి పట్ల వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌ఛార్జి పేర్ని కిట్టు, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బూరగడ్డ శ్రీకుమార్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

రైతన్నలకు వెన్నుదన్నుగా పీఏసీఎస్‌లు



పెట్రోల్ బంకు ప్రారంభోత్సవ శిలఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాగిత, జేసీ గీతాంజలి శర్మ

పెడన: పీఏసీఎస్‌లు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని, వీటి బలోపేతానికి పెట్రోల్ బంకులు చేదోడుగా ఉంటాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మడక గ్రామంలో నందమూరు వీపీఏసీసీఎస్ (విశాల ప్రాథమిక పరపతి సహకార సంఘం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ప్రారంభించారు. పీఏసీఎస్‌ల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీవో చంద్రశేఖర్‌రెడ్డి, సీఈవో శ్యామ్‌మనోహర్, కేవీస్ హెటేష్, ఫణికుమార్, సాయిబాబు, వైవీవీ రామ్మోహనరావు, టీడీపీ నాయకులు శెలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- నడుపూరులో పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. పాడి రైతులు పశువులకు వైద్యం చేయించి ఉచితంగా మందులు తీసుకున్నారు. జిల్లా పశువైద్యాశాఖాధికారిణి హరిత, పెడన ఏడీ బాబూరావు, వైద్యులు అల్తాఫ్, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు నడుపూరు గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద శిక్షణ పొందుతున్న సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను ఎమ్మెల్యే కాగిత కలిసి వారికి కొన్ని సూచనలు చేశారు. పంచాయతీలపై పట్టుసాధించి వాటి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీడీవో రెడ్డయ్య, ఈవోపీఆర్డీ జయరాం తదితరులున్నారు.
- పెడన పట్టణంలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్‌లను ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అందజేశారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాది కాలనీల్లో కలెక్టర్ పర్యటన

- ఇప్పటికీ ఏ ధ్రువపత్రాలూ లేకపోవటంపై విస్మయం
- దరఖాస్తు చేయించి చర్యలు తీసుకోవాలని ఆదేశం



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని నారాయణపురం, ముస్తాఖాన్‌పేట యానాది కాలనీల్లో జీవిస్తున్న యానాదులకు ఆధార్, జనన, కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవటంపై జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విస్మయాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ బాలాజీ శుక్రవారం ఈ రెండు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు ధ్రువీకరణ పత్రాలు లేవంటూ వారు కలెక్టర్‌కు వివరించటంతో ఒకింత విస్మయానికి గురైన ఆయన వారితో దరఖాస్తులు చేయించి ధ్రువీకరణపత్రాలు జారీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం గిరిజనులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తోందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ సిబ్బందితో కలెక్టర్ సమావేశమై గిరిజనులకు ఇప్పటి వరకు ఆధార్‌కార్డులు లేకపోవటం శోచనీయమని పేర్కొన్నారు. తాగునీటి పరిస్థితిని ఆరాతీశారు. పిల్లలకు అంగన్‌వాడీ సేవలు అందుతున్నాయో, లేదో అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వ సేవలను అందించాలని ఉద్యోగులను ఆదేశించారు. ముస్తాఖాన్‌పేట కాలనీలో కమ్యూనిటీ హాలు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేస్తామన్నారు. వెంటనే ఫైల్ పెట్టాలని గిరిజన సంక్షేమశాఖాధికారులను ఆదేశించారు. యానాది చిన్నారులకు బిస్కట్లను అందజేసి వారితో ముచ్చటించారు. కలెక్టర్ వెంట కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.ప్రకాశరావు, మచిలీపట్నం సౌత్, నార్త్ తహసీల్దార్లు మధుసూధనరావు, కె.శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు

కోనేరుసెంటర్: మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్థి మరొకటి లేదని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ సౌజన్యంతో కారుణ్య రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో క్షయవ్యాధిగ్రస్తులకు ఏర్పాటు చేసిన పోషకాహార కిట్‌లను శుక్రవారం మంత్రి మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం కింద క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి తగిన చికిత్స అందించటంతో పాటు న్యూట్రిషియన్ ఫుడ్‌ను అందిస్తుందన్నారు. అందులో భాగంగా రోజుకు 50 మందికి మూడు నెలలకు సరిపడా న్యూట్రిషన్ ఫుడ్ కిట్‌లను అందించేందుకు ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ కింద ముందుకు రావటం అభినందనీయమన్నారు. అదనపు డీఎంహెచ్‌వో (టీబీ కంట్రోల్) డాక్టర్ ఎ.వెంకట్రావు, ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణస్వామి, కారుణ్య రూరల్ డెవలప్‌మెంట్ ఎన్జీవో అధ్యక్షుడు టి.మధుసూదనరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జెడ్పీటీసీ లంకే నారాయణప్రసాద్, జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

విలీనంతో ఆర్టీసీ అప్పులపాలు

మచిలీపట్నంటౌన్: గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆ సంస్థను అప్పుల పాల్జేసిందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం మంత్రి ఐదు నూతన బస్సు సర్వీసులను ప్రారంభించారు. మచిలీపట్నం – విజయవాడకు మూడు నాన్‌స్టాప్ బస్సులు, బీహెచ్ఈఎల్‌కు రెండు స్లీపర్ సర్వీసులను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ చర్యలతో ఆర్టీసీ ఇబ్బందులపాలైందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి వాణిశ్రీ, డిపో మేనేజర్ టి.పెద్దిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంట నమోదు పరిశీలన



కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండల పరిధిలోని కొక్కిలిగడ్డలో రైతు మత్తి రవి పొలంలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఏడీఏ జయప్రద శుక్రవారం పరిశీలించారు. ఎంఏవో కె.హెప్సిబారాణి, వీఏఏ ఎస్.బాలాజీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెడన: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందిన సంఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెడన 21వ వార్డుకు చెందిన పామర్తి ప్రేమ్‌కుమార్ (30) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. మద్యానికి, వ్యసనాలకు బానిసాయ్యాడు. నిత్యం భార్య, తల్లి మందిలిస్తూనే ఉన్నారు. ఈ నెల 2వ తేదీన కూడా భార్య, తల్లి మందలించడంతో మద్యంలో గడ్డిమందు తీసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించడంలో చికిత్స పొందుతూ 8వ తేదీ రాత్రి మృతి చెందాడు. భార్య నాగదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన పోలీసులు 9వ తేదీన కేసు నమోదు చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు

గూడూరు: గూడూరు మండల ఎస్ఐగా కె.ఎస్.వి.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా సత్యనారాయణ చిలకలపూడి నుంచి గూడూరుకు వచ్చారు. అంతకు ముందు ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న ఐ.వీర్రాజు వీఆర్‌కు వెళ్లారు.

కృత్తివెన్ను: మండల ఎస్ఐగా పైడిబాబు శుక్రవారం బాధ్యతలను తీసుకున్నారు. గతంలో బంటుమిల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన పైడిబాబు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను పర్యవేక్షించడమే కాకుండా జూదాలు, నాటుసారా, అసాంఘిక కార్యక్రమాలు ఉంటే పూర్తిగా అదుపుచేస్తానన్నారు.

బంటుమిల్లి: బంటుమిల్లి ఎస్ఐగా ఏ.గణేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా బదిలీపై వచ్చిన ఎస్ఐ జి. వాసు వీఆర్‌కు వెళ్లారు. ఉయ్యూరు టౌన్ ఎస్ఐగా ఉన్న గణేష్‌కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. స్టేషన్ సిబ్బంది ఎస్ఐని కలసి పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు.

ఇద్దరు సీఐల బదిలీ

కోనేరుసెంటర్: బందరు సబ్‌డివిజన్ పరిధిలో ఇరువురు సీఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిలకలపూడి సీఐ సీహెచ్ సతీష్ కుమార్‌ను ఏలూరు రేంజ్ ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఎస్కే అబ్దుల్‌నబీని నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఆర్‌పేట సీఐగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌యాదవ్‌ను వీఆర్‌కి పంపుతూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ ఆయన స్థానంలో గుడివాడ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తూ వీఆర్‌లో ఉన్న కె.ఏసుబాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారంతా వెంటనే విధులకు హాజరుకావాలని ఎస్పీ ఆదేశించారు.

విత్తనాలు నాటిన విద్యార్థులు

రావివారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని రావివారిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల విద్యార్థులు, కేవీకే ఘంటసాల ఆధ్వర్యంలో శుక్రవారం న్యూట్రిగార్డెన్ నిమిత్తం విత్తనాలు నాటారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి సూర్యమండలం మోడల్‌లో న్యూట్రిగార్డెన్ ఏర్పాటు కోసం విత్తనం నాటే విధానాన్ని వివరించారు. అంగన్‌వాడీ, పాఠశాలల్లో సేంద్రీయ విధానంలో పండించిన ఆకు కూరలు, కూరగాయలతో పౌష్టికాహారం అందించేందుకు న్యూట్రి గార్డెన్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. సైన్స్ కళాశాల విద్యార్థులు, గ్రామ ప్రముఖులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సముద్రంలో కలుస్తున్న వరదనీరు



కోడూరు: ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ వచ్చి సముద్రంలో కలుస్తోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేసిన లక్షలాది క్యూసెక్కుల వరద నీరు హంసలదీవిలోని కృష్ణా సాగరసంగమం వద్దకు చేరుతున్నాయి. వరద నీరు భారీగా వచ్చి సాగరంలో చేరుతుండడంతో సంగమ ప్రాంతంలో నీటి రంగు మారి కనిపిస్తున్నాయి. ప్రసుత్తం సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండగా, భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో ఆ ప్రాంతమంతా ఆహ్లాదకరంగా మారింది. భారీగా చెరువుతున్న వరదనీరుతో ఉల్లిపాలెం–భవానీపురం వారధి వద్ద కృష్ణమ్మ నిండుకుండలా మారింది.